సాక్షి మహబూబాబాద్

ఆదివారం | 28 | జూలై | 2024



విద్యుత్..కావొద్దు విషాదం

వినియోగదారులు, రైతులు విద్యుత్ ప్రమాదాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.

- 10లో▸



నిలకడగా ప్రాణహిత నది

మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది నిలకడగా ప్రవహిస్తోంది.

- 10లో▸

గరిష్టం/కనిష్టం
$29^0 / 24^0$

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

ఎస్సీ వర్గీకరణలో కాలయాపన తగదు



మహబూబాబాద్ రూరల్: కేంద్రంలోని బీజేపీ భాగస్వామ్య పాలకపక్షాల ప్రభుత్వం పది సంవత్సరాల నుంచి ఎస్సీ వర్గీకరణ ఇదిగో అదిగో అంటూ మాదిగలను, దళితులను మభ్యపెడుతూ కాలయాపన చేశారని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, న్యాయవాది దర్శనం రామకృష్ణ అన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోరుతూ ఆగస్టు 1, 2 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని అంబేడ్కర్ విగ్రహం ఎదుట పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. సుప్రీంకోర్టు కేసును పరిష్కరించి ఆర్టికల్ 371 (డీ) ద్వారా ఎస్సీ ఏ, బీ, సీ, డీ వర్గీకరణను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు బోడ లక్ష్మణ్ నాయక్, తప్పెట్ల చాణిక్య, దర్శనం నరేంద్ర శంకర్, వడకాల సాయిచందర్, జినక రవీందర్, హెచ్. కృష్ణ, యుగేందర్, చరణ్, మాలోత్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్ రూరల్: వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో వినియోగదారులకు ఎక్కడ అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందిస్తున్నందుకుగాను అధికారులు, సిబ్బందిని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అభినందించారని విద్యుత్ శాఖ ఎస్ఈ జె.నరేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న చోట విద్యుత్ సిబ్బంది తక్షణమే స్పందించి పునరుద్ధరించడంలో వారి సేవలు మరువలేనివన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు.

సకాలంలో ముద్ర రుణం చెల్లించాలి



గార్ల: ముద్ర రుణం తీసుకున్న లబ్ధిదారులు వెంటనే రుణం చెల్లించాలని గార్ల డీసీసీబీ బ్యాంకు మేనేజర్ జి.సృజన పేర్కొన్నారు. శనివారం స్థానిక బ్యాంకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముద్ర రుణం కట్టని వారితో మిగతా వారికి రుణాలు ఇవ్వలేకపోతున్నామన్నారు. ఇక నుంచి ముద్ర రుణం తీసుకున్న వారికి, షూరిటీ పెట్టిన వారికి కూడా రుణం ఇవ్వమన్నారు. రుణం చెల్లించకుంటే అవసరమైతే వారి ఇల్లు కూడా జప్తు చేసేందుకు వెనకాడబోమన్నారు.

రుణమాఫీ సందేహాల నివృత్తికి గ్రీవెన్స్ సెల్

మహబూబాబాద్ రూరల్: రైతులకు పంట రుణాల మాఫీ విషయంలో సందేహాల నివృత్తికి జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ (హెల్ప్ డెస్క్) ఏర్పాటు చేశామని డీఏఓ కొర్స అభిమన్యుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణమాఫీపై రైతులకు ఎలాంటి సందేహాలు, అనుమానాలు ఉంటే గ్రీవెన్స్ సెల్ ఫోన్ నంబర్ 08719 240841కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. క్లస్టర్ స్థాయిలో ఏఈఓలు, మండల స్థాయిలో మండల వ్యవసాయ అధికారులు, డివిజన్ స్థాయిలో ఏడీఏలను సంప్రదించవచ్చని తెలిపారు.

అలరించిన లవకుశ నాటకం



హన్మకొండ కల్చరల్: సురభి 140వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భానోదయ నాట్యమండలి ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో సురభి నాటక ప్రదర్శనలు జరుగుతున్నాయి. మూడవరోజు శనివారం లవకుశ నాటక ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. ముందుగా నాట్యమండలి అధ్యక్షుడు రేకందర్ నాగబాబు జ్యోతిప్రజ్వలన చేసి ప్రదర్శనలను ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ కళాకారులు కళారాజేశ్వర్ రావు, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాకపాయె!

అన్ని అర్హతలున్నా.. జాబితాలో పేర్లు గల్లంతు

- తప్పులు ఉన్నాయని బ్యాంకర్ల ఇబ్బంది
- ఆన్‌లైన్ కాలేదని జాప్యం
- వ్యవసాయ సీజన్‌లో రైతుల అగచాట్లు
- మొదటి విడతలో 27,652 మంది రైతులకు రూ. 156 కోట్ల రుణమాఫీ



మానుకోట రైతు వేదికలో ఫిర్యాదులు ఇస్తున్న రైతులు

సాక్షి, మహబూబాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ అందుకునేందుకు రైతులు నానా తంటాలు పడాల్సి వస్తుంది. వ్యవసాయ అధికారుల తప్పుడు జాబితా ఒక వైపు, బ్యాంకర్ల కిరికిరీ మరోవైపు.. పలు బ్యాంకుల్లో ఆన్‌లైన్ ఇబ్బందులు వెరసి నిండు వ్యవసాయ సీజన్‌లో రైతులు బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే వీటిని సరిచేస్తామని కొందరు చెబుతుండగా.. అసలు రుణమాఫీ కాదని ఇంకొందరు రైతులకు చెప్పడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో రైతులు ఉన్నారు.

అధికారుల వద్దకు పరుగులు

అందరికీ రుణమాఫీ అవుతుంటే తమకెందుకు జాబితాలో పేరు రాలేదని తప్పులు పడిన వారు ముందు బ్యాంకుల వద్దకు, తర్వాత వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు పరుగులు పెడుతున్నారు. ఇలా జిల్లాలో ఇప్పటి వరకు 200 లకు పైగా రైతులు తమకు రుణమాఫీ అందేవిధంగా చూడాలని అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ప్రధానంగా ఆధార్ నంబర్‌కు పట్టాపాస్ పుస్తకానికి మధ్య తేడా ఉండటం, ప్రైవేట్‌లో చిన్న చిన్న ఉద్యోగాలు చేసిన వారిని అనర్హులుగా ప్రకటించారని, కొందరు రైతులు రుణాలను రెన్యువల్ చేయించుకున్నా.. పేర్లు గల్లంతు కావడం, ఇండియన్ బ్యాంకు , ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుల్లో 2,500 మంది రైతులకు అందాల్సిన రుణమాఫీ డబ్బులు ఇంకా ఆన్‌లైన్ కాలేదని చెప్పడం మొదలైన సమస్యలు ఎదురవుతున్నాయి. అదేవిధంగా కొందరు బ్యాంకర్ల మధ్య దళారులను పెట్టి రైతుల వద్ద డబ్బులు తీసుకోవడం, పలు సహకార బ్యాంకుల్లో వాటా ధనం పేరుతో డబ్బులు గుంజడం, డిపాజిట్లు చేయాలని ఒత్తిడి తేవడం, ఇతర రుణాలకు లింకు పెట్టి రుణాలు ఇవ్వకపోవడం వంటి సంఘటనలు ఎదురవుతున్నాయి.

పేర్లు గల్లంతు.. తప్పులతో ఇబ్బందులు

జిల్లా వ్యాప్తంగా పెద్ద రైతు నుంచి చిన్న రైతుల వరకు 2,30,000 మంది ఉంటారు. ఇందులో జిల్లాలోని 13 బ్యాంకుల పరిధిలో 1.60 లక్షల మంది రైతులు రూ. 1,600 కోట్లకు పైగా రుణాలు తీసుకున్నారు. అయితే ప్రభుత్వం మంత్రి వర్గ ఉప సంఘ నిర్ణయం మేరకు అర్హుల జాబితాను ప్రకటించారు. ఇందులో భాగంగా మొదటి విడత రూ.1 లక్ష లోపు రుణమాఫీ చేస్తున్నట్లు నిధులు, అర్హులైన రైతుల పేర్లతో ఈనెల 18న జాబితాను విడుదల చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని 27,652 మంది రైతులకు రూ. 156 కోట్లు రుణమాఫీ డబ్బులు విడుదల చేశామని సంబంధిత బ్యాంకుల్లో రుణాలు మాఫీ చేసుకుని కొత్త రుణాలు తీసుకోవాలని ప్రకటించారు. రుణమాఫీకి అన్ని అర్హతలున్నా అధికారులు విడుదల చేసిన జాబితాలో పేర్లు లేకపోవడం, పేర్లు ఉన్నా బ్యాంకుల్లో తప్పులు ఉండటం, రెన్యువల్ చేయలేదని మొదలైన కారణాలు ఉన్నాయి. వీరికి రుణమాఫీ చేయడం ఇబ్బందిగా ఉంటుందని బ్యాంకర్లు చెప్పడంతో వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు రైతులు పరుగులు పెడుతున్నారు.

పేరు తప్పు అని తిప్పుతున్నారు



నాకు మా అమ్మానాన్నల నుంచి సంక్రమించిన భూమిపై రూ.85వేల లోను ఉంది. పాస్ బుక్‌లో ఇంటి పేరు తప్పుగా ఉందని, రుణమాఫీ వర్తించదని చెబుతున్నారు. అధికారులు పరిశీలించి రుణమాఫీ చేయించాలి.

– అజ్మీరా సరిత, రోటిబండ తండా, మహబూబాబాద్

ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు..



నా భార్య పేరున రూ.50వేలు, నా పేర రూ.1.60లక్షల రుణం తీసుకున్న. బ్యాంకులో ఎంత అప్పు ఉంది, రుణమాఫీ ఎంత అవుతుందని బ్యాంకర్లను అడిగితే ఆన్‌లైన్‌లో చూపించడం లేదని చెబుతున్నారు. సరిచేసి డబ్బులు ఇప్పించండి.

– రావుల చిన్నకొమురయ్య, పెనుగొండ, కేసముద్రం

నూతన రుణాలు అందజేస్తున్నాం..



ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ డబ్బులు త్వరగా అందించాలని అన్ని బ్యాంకుల మేనేజర్లకు చెప్పాం. తప్పులు, ఇతర ఇబ్బందులు ఉన్నవారి సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశాం.

– ఆర్ఎస్ఎన్ మూర్తి, లీడ్ బ్యాంకు మేనేజర్

చట్టాలపై అవగాహన ఉండాలి

- జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సురేశ్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సురేశ్

మహబూబాబాద్ రూరల్: చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సి.సురేశ్ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ పర్యవేక్షణలో శనివారం మహబూబాబాద్ సబ్ జైలులో న్యాయ చైతన్య సదస్సు, జైల్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సురేశ్ మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సి వస్తుందని పేర్కొన్నారు. జైలు అదాలత్ నిర్వహించి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పి.మౌనిక 3 కేసుల్లో నిందితుడిగా ఉన్న చింత యుగంధర్ రిమాండ్ కాలాన్ని శిక్షా కాలంగా పరిగణించి విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో జైలర్ మల్లెల శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల చేతికి వాహనాలు ఇవ్వొద్దు

- తొర్రూరు సివిల్ కోర్టు జడ్జి సరిత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి సరిత

నెల్లికుదురు: పిల్లల చేతికి వాహనాలు ఇవ్వొద్దని తొర్రూరు సివిల్ కోర్టు జడ్జి మట్ట సరిత తల్లిదండ్రులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాల బారిన పడితే ఆ కేసుల నుంచి బయట పడటం చాలా కష్టమన్నారు. విద్యార్థులు ర్యాగింగ్ అనే పెను భూతానికి దూరంగా ఉండి చదువులో ముందు వరుసలో ఉండాలన్నారు. అలాగే మయూరి మండల సమాఖ్య కార్యాలయంలో వివిధ గ్రామాల మహిళా సంఘం సభ్యులు, వీఓఏలకు గృహహింస చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చిర్ర రమేష్ బాబు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ కవిరాజు, వరదయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలను రక్షించొచ్చు..

- డీఎంహెచ్ఓ కళావతిబాయి



సీపీఆర్ చేస్తూ అవగాహన కల్పిస్తున్న అధికారులు

మహబూబాబాద్ అర్బన్: గుండెపోటు వచ్చిన వ్యక్తికి అంబులెన్స్ వచ్చేలోగా కార్డియోపల్మనల్ రెస్పిరేటరీ (సీపీఆర్) చేస్తూ ప్రాణాలను రక్షించొచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి అన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ప్రపంచ కార్డియో పల్మనల్ రెస్పిరేటరీ దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఎవరికైన ఆకస్మికంగా గుండెపోటుకు గురైతే వెంటనే ప్రథమ చికిత్స చేయాలని, రోగి గుండెపై చేయి వేసి కాస్త ఒత్తిడి పెంచి రాయడంతో గుండె తిరిగి కొట్టుకునేలా చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ,ప్రోగ్రాం అధికారి డాక్టర్లు, నాగేశ్వర్‌రావు, శ్రావణ్ కుమార్, మీడియాధికారి ప్రసాద్, ఇన్‌చార్జ్ డీపీహెచ్ఎన్ఓ మంగమ్మ, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్,ఎంపీహెచ్ఈఓ రామకృష్ణ, అధ్యాపకులు ప్రసాద్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవుల్లో ఉత్కంఠ

- ఉనికి కోసం మావోలు.. ఆధిపత్యం కోసం పోలీసులు
- నేటినుంచి మావోయిస్ట్ అమరవీరుల వారోత్సవాలు
- ఏజెన్సీ గ్రామాల్లో ఉద్రిక్త వాతావరణం



అనుమానాస్పద యువకులను ప్రశ్నిస్తున్న ఎస్సై కుషకుమార్

కొత్తగూడ : మావోయిస్ట్ పార్టీ అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను నేటినుంచి నిర్వహించనున్నారు. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. కొత్తగూడ, గంగారం మండలాల్లో పట్టు సాధించి ఉనికి చాటుకునేందుకు మావోయిస్టులు, పూర్తి స్థాయిలో వారిని కట్టడి చేసి ఆధిపత్యం కొనసాగించేందుకు పోలీసులు కూంబింగ్ చేపట్టినట్లు తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతం రెండు మండలాల్లో వ్యాపించి ఉంది. ఈ అటవీ ప్రాంతం ఒకప్పుడు మావోయిస్టు పార్టీ కార్యకలాపాలకు అడ్డాగా ఉండేది. గంగారం మండలం మడగూడెం గ్రామానికి చెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేత యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ మరణానంతరం రెండు మండలాల్లో వారి అలికిడి జాడ లేకుండా పోయింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి గుండాల మండలం మీదుగా మావోలు రాష్ట్రంలోకి ప్రవేశించి మళ్లీ వారోత్సవాలు నిర్వహిస్తారనే ఇంటెలిజెన్స్ వర్గాల హెచ్చరికల నేపథ్యంలో సరిహద్దు అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలు ప్రత్యేక కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. దీంతో మహబూబాబాద్, ములుగు జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో పోలీసులు కూంబింగ్‌ను మరింత విస్తృతం చేశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన కొత్తగూడ ఎస్సై కుషకుమార్ తనిఖీలను విస్తృతం చేశారు. ఎన్‌కౌంటర్ నుంచి తప్పించుకున్న నక్సలైట్లు గ్రామాలకు రావడం, వారోత్సవాల్లో మావోలకు సాయం చేసేందుకు సరుకులు తీసుకువెళ్లవచ్చనే అనుమానంతో తనిఖీ చేపట్టారు. అనుమానంగా కనిపించిన వారిని ప్రశ్నించి వదిలేస్తున్నారు. గతంలో మావోయిస్టు పార్టీకి సహకరించిన మిలిటెంట్లను గంగారం ఎస్సై రవికుమార్ పిలిపించి విచారించినట్లు సమాచారం. గూడూరు సీఐ బాబూరావు తనిఖీలను పర్యవేక్షిస్తూ మారుమూల గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి యువకులతో మాట్లాడుతున్నారు. తెలియని వ్యక్తులను ఇళ్లల్లో ఉండనీయవద్దని అలాంటి సమాచారం వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను చైతన్యం చేస్తున్నారు.

మరింత చేరువగా 'రైతు నేస్తం'

- అన్నదాతలకు సాంకేతిక పరిజ్ఞానంతో సలహాలు సూచనలు
- వ్యవసాయ శాస్త్రవేత్తలతో నేరుగా మాట్లాడే అవకాశం
- భూపతిపేట రైతు వేదికకు మంజూరైన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్




భూపతిపేట రైతు వేదికలో సీఎం ప్రసంగం వింటున్న అధికారులు, రైతులు (ఫైల్)

గూడూరు: అత్యాధునిక పరిజ్ఞానంతో అన్నదాతలకు వ్యవసాయ రంగంలో సలహాలు, సూచనలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక పద్ధతులు, క్షేత్రస్థాయికి తీసుకు వెళ్లడంతో పాటు రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి కొన్ని నెలల క్రితం ప్రయోగాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. హైదరాబాద్ నుంచి నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇచ్చే ఏర్పాట్లు చేశారు. ముందస్తుగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపిక చేసిన రైతు వేదికలో ప్రతీ మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో ఇక నుంచి ప్రతీ మండలానికి ఒక రైతు నేస్తం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లాలో 16 మండల కేంద్రాల్లో..

జిల్లాలోని 16 మండల కేంద్రాల్లో మొత్తం 82 రైతు వేదికలున్నాయి. వాటిలో మండల కేంద్రాలకు అనువుగా ఉండే రైతు వేదికను ఎంపిక చేశారు. అందులో గూడూరు మండలం భూపతిపేట రైతు వేదిక ఎంపికైంది. ఎంపికైన రైతు వేదికలో రూ. 3.75 లక్షల వ్యయంతో కంప్యూటర్, ప్రింటర్, ఎల్ఈడీ, టీవీ, ఇంటర్‌నెట్ సదుపాయంతో పాటు అవసరమైన ఫర్నిచర్‌ను సమకూర్చారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి చేశారు. అయితే రైతు రుణమాఫీ ప్రారంభానికి ముందుగా హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి వర్చువల్‌గా ప్రారంభించి పలువురు రైతులతో వీసీలో నేరుగా మాట్లాడారు.


సలహాలు, సూచనలు పొందవచ్చు



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, పంటల సాగు, రుణాలకు సంబంధించిన సందేహాలను త్వరగా తెలుసుకోవచ్చు. వ్యవసాయ శాస్త్రవేత్తలో మాట్లాడి సాగులో మెళకువలు తెలుసుకోవచ్చు.

– సమ్మెట వెంకటయ్యగౌడ్, రైతు, గూడూరు


చీడపీడల నివారణకు..



పంటల సాగు విధానం, చీడపీడల నివారణకు వ్యవసాయ శాఖ అధికారులతో నేరుగా మాట్లాడి నివారణకు చర్యలు తీసుకోవచ్చు. ఎరువులు, విత్తనాలు ఏ పంటకు ఎంత మోతాదులో వేయాలో కూడా తెలుసుకోవచ్చు.

– బుర్ర శ్రీనివాస్‌రెడ్డి, రైతు, గూడూరు

రైతులకు ఎంతో మేలు..



ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. ప్రతీ మంగళవారం ఎప్పటికప్పుడు వీసీలో పంటల సాగులో మెళకువలు, చీడపీడల నివారణ అంశాలను తెలుసుకోవచ్చు.

– అభిమన్యుడు, డీఏఓ

కుక్కల సమస్య పరిష్కరించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి , తదితరులు

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలో కుక్కల సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డితో పాటు వైస్ చైర్మన్ మార్నెని వెంకన్న, కౌన్సిలర్లు శనివారం వినతి పత్రం అందించారు. అనంతరం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ (ఏబీసీ) ద్వారా కుక్కల సంఖ్య పెరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పట్టణంలో కుక్కలు లేకుండా చేయాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి సలహాలు సూచనలు తీసుకొని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బుజ్జి వెంకన్న, భూక్య శ్రీను, నాయకులు శంకర్, కోడి శ్రీనివాస్, శివకుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

రామప్పలో పర్యాటకుల సందడి

వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయంలో శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు రామప్ప రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ తీర్థప్రసాదాలు అందించి పర్యాటకులను ఆశీర్వదించగా గైడ్ విజయ్‌కుమార్ ఆలయ విశిష్టతను వివరించారు.

ఆలయ పరిసరాలు జలమయం

రామప్పలో శనివారం భారీ వర్షం పడింది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు రామప్ప ఆలయ పైకప్పు కురుస్తోంది. ఆలయ ఆవరణ వర్షపు నీటితో చిత్తడిగా మారడంతో పాటు రామప్ప ఆలయ పరిసర ప్రాంతాలు జలమయం అయ్యాయి. సరస్సు మత్తడి నుంచి వచ్చే వరదనీటితో పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి.

ఎంజీఎంలో ఫ్లెక్సీల కలకలం



ఎంజీఎం ఆస్పత్రిలో వెలిసిన ఫ్లెక్సీలు

ఎంజీఎం: సాధారణ బదిలీల్లో బాగంగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి పరిపాలనాధికారి బదిలీపై వెళ్లగా శాడిస్టు పాలనాధికారి బదిలీపై వెళ్లడంతో పీడ విరగడ అయిందని, సిబ్బంది అందరం ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకుంటున్నామంటూ ఆస్పత్రిలో వెలిసిన ఫ్లెక్సీలు కలకలం రేపాయి. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఈ ఫ్లెక్సీలను ఓపీ గేట్‌తోపాటు క్యాజువాలిటీ గేట్ వద్ద కట్టి వెళ్లారు. వెంటనే విషయాన్ని సెక్యూరిటీ సిబ్బంది ద్వారా తెలుసుకున్న అధికారులు వాటిని తొలగించారు. ఫ్లెక్సీ ఫొటోలు శనివారం సాయంత్రం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో ఎంజీఎం వైద్యులు, సిబ్బందిలో ఒక్కసారిగా చర్చనీయాంశంగా మారింది.

జాతీయ సాధన సర్వే పరీక్షకు సన్నద్ధం చేయాలి

- డీఈఓ రామారావు



మాట్లాడుతున్న డీఈఓ రామారావు

మహబూబాబాద్ అర్బన్: దేశవ్యాప్తంగా నిర్వహించబోయే జాతీయ సాధన సర్వే పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కంకరబోర్డు ప్రభుత్వ పాఠశాలలో శనివారం జాతీయ సాధన సర్వే శిక్షణ నిర్వహించారు. అనంతరం ఫాతిమా హైస్కూల్‌లో నేషనల్ గ్రీన్ కోర్‌ను ఏర్పాటు చేయగా డీఈఓ హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాల్యం నుంచే పర్యావరణ అనుకూల జీవన విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. వర్క్ షాప్‌లో విద్యార్థులు ఎల్ఈడీ ట్యూబ్‌లైట్స్, కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించారు. అనంతరం ట్యూబ్‌లైట్ల తయారీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌కోర్ కోఆర్డినేటర్ డాక్టర్ గురునాథరావు, ఏఎంఓ ఆజాద్ చంద్రశేఖర్, హెచ్ఎంలు ఆరోగ్యమేరి, కోట్యానాయక్, నాగముని, ఉపాధ్యాయులు వీరన్న, యాదగిరి పాల్గొన్నారు.

ఆగస్టు 17 నుంచి ఎంఎస్‌డబ్ల్యూ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య కేంద్రంలో ఎంఎస్‌డబ్ల్యూ ఫైనల్ ఇయర్ పరీక్షల టైంటేబుల్‌ను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. ఆగస్టు 17, 20, 22, 24, సెప్టెంబర్ 2, 4 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వారు తెలిపారు.

క్లుప్తంగా

గోల్కొండ, శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ రైళ్లు రద్దు

- ఆగస్టు 5 నుంచి 10వ తేదీ వరకు అమలు



కాజీపేట రూరల్‌ : కాజీపేట జంక్షన్‌, వరంగల్‌ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణించే గోల్కొండ, శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ రైళ్లను విజయవాడ సెక్షన్‌లో రైల్వే ఇంజనీరింగ్‌ పనుల కారణంగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. సికింద్రాబాద్‌–గుంటూరు గోల్కొండ, సికింద్రాబాద్‌–విజయవాడ శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లను అప్‌ అండ్‌ డౌన్‌ మార్గంలో ఆగస్టు 5 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ రద్దును ప్రయాణికులు గమనించాలని కోరారు.

రైల్వే విజిలెన్స్‌ అధికారుల తనిఖీ

కాజీపేట రూరల్‌ : కాజీపేట జంక్షన్‌ పరిధిలో సికింద్రాబాద్‌ రైల్వే విజిలెన్స్‌ అధికారులు శనివారం తనిఖీ చేశారు. కాజీపేట జంక్షన్‌ పరిధిలో గల రైల్వే క్రాసింగ్‌ గేట్ల వద్దకు వెళ్లి వాటి పనితీరు, గేట్‌మన్ల అప్రమత్తత, రాత్రి, పగలు విధుల పనితీరు, పరికరాలను తనిఖీ చేసినట్లు స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే గేట్ల వద్ద తనిఖీ చేసిన అధికారులు గేట్‌మన్ల సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా కాజీపేట జంక్షన్‌ పరిధిలో కొంత మంది రైల్వే అధికారులు .. సిబ్బందిని తమ ఇళ్లలో సొంత పనులకు ఉపయోగించుకుంటున్నారనే సమాచారంతో విజిలెన్స్‌ అధికారులు ఆరా తీస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

11వాహనాలు సీజ్‌

- రూ.3.75 లక్షల జరిమానా



సీజ్‌ చేసిన లారీలు

హసన్‌పర్తి: యాదాద్రి–ఆరెపల్లి జాతీయ రహదారి మార్గమధ్యలోని కోమటిపల్లి టోల్‌ గేట్‌ వద్ద విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌, గనులు, రాష్ట్ర పన్నుల విభాగం, ఆర్టీఏ అధికారులు శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న 11 వాహనాలను గుర్తించారు. ఏడు ఇసుక లారీలు, డోలమైట్‌, గ్రానైట్‌ బ్లాక్‌ లారీలు ఒక్కొక్కటి, రెండు ఫ్లైయాష్‌ లారీలను సీజ్‌ చేశారు. రూ.3.75 లక్షల జరిమానా విధించారు. సీజ్‌ చేసిన లారీలను ఆర్టీఏ కార్యాలయానికి తరలించినట్లు అధికారులు చెప్పారు. మోటార్‌ వెహికిల్‌ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

విద్యుత్‌.. కావొద్దు విషాదం

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

- వర్షాకాలంలో పొంచి ఉన్న ముప్పు
- ఆదమరిస్తే అంతే.. ప్రాణాలు గాల్లోకి..
- తడిచిన విద్యుత్‌ ఉపకరణాలను తాకొద్దు



విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌

హన్మకొండ: విద్యుత్‌.. విషాదం కావొద్దు. వినియోగదారులు, రైతులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఏ మాత్రం ఆదమరిచినా ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. ప్రధానంగా వర్షాకాలంలో తరచూ విద్యుత్‌ ప్రమాదాలు సంభవిస్తుంటాయి. తడి దుస్తులు ఆరేస్తూ, మోటార్లు ఆన్‌ చేస్తూ, మరమ్మతుల సమయంలో విద్యుత్‌ తీగలు పట్టుకుని, తెగిన తీగల కారణంగా తరచూ పలువురు చనిపోతున్నారు. అలాగే, తెగిన విద్యుత్‌ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌ గద్దెలు తక్కువ ఎత్తులో ఉండడంతో పశువులు కూడా విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయి. దీనికి కారణం విద్యుత్‌ సిబ్బంది భద్రతా చర్యలు, ఎల్‌సీల్లో నిబంధనలు పాటించకపోవడమేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్‌ సంస్థల యాజమాన్యం జాగ్రత్తలు పాటించాలని సూచించినా సిబ్బంది వాటిని విస్మరించి విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటూ ఆయా కుటుంబాలను దుఃఖసాగరంలో ముంచుతున్నారు.

65 సబ్‌ స్టేషన్ల ద్వారా విద్యుత్‌ సరఫరా

హనుమకొండ జిల్లాలో 65 విద్యుత్‌ సబ్‌ స్టేషన్లు, 11,123 డిస్ట్రిబ్యూషన్‌ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా విద్యుత్‌ సరఫరా జరుగుతోంది. జిల్లాలో మొత్తం 4,41,252 మంది విద్యుత్‌ వినియోగదారులున్నారు. ఇందులో 3,27,020 మంది గృహ విద్యుత్‌ వినియోగదారులు, 64,204 మంది వ్యవసాయ విద్యుత్‌ వినియోగదారులున్నారు. వీరితో పాటు మిగతా వినియోగదారులున్నారు.

అప్రమత్తతే ఆయుధం

అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో విద్యుత్‌ ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. పొలాల వద్ద రైతులు, ఇళ్లలో కుటుంబీకులు విద్యుత్‌ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి. వర్షాలు కురుస్తున్న సమయంలో గోడలు, నేల, విద్యుత్‌ స్తంభాలు తేమతో నిండి ఉంటాయి. ఈ తేమతో ప్రమాదాలు జరుగుతాయి. విద్యుత్‌ లైన్లకు ఆనుకుని ఉన్న స్తంభాల నుంచి నేల, గోడలు, ఇతర వస్తువులకు విద్యుత్‌ ప్రవాహం జరిగి విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశముంది. ఏ మాత్రం ఏమరు పాటు వహించిన ప్రాణాలు పోవడం ఖాయం. ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా విద్యుదాఘాతానికి గురికాకుండా ఉండొచ్చు.

వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వర్షం కురుస్తున్న సమయంలో, కురిసిన తర్వాత తడిసిన విద్యుత్‌ స్తంభాల స్టేవైరు, సపోర్టు వైరు, తడిచిన విద్యుత్‌ ఉపకరణాలను తాకొద్దు.
- దండెం వైర్లు, విద్యుత్‌ వైర్లను కలపొద్దు. సపోర్ట్‌ వైర్లుగా ఇన్సులేటెడ్‌ జీ.ఐ వైర్లను ఉపయోగించాలి.
- ప్రజలు, వినియోగదారులు విద్యుత్‌ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సర్వీస్‌ వైర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వాటిని తాకకుండా దూరంగా నడవాలి.
- ఓల్టేజ్‌లో హెచ్చు తగ్గులున్నా, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తున్నా వెంటనే విద్యుత్‌ అధికారులకు తెలపాలి.
- వర్షాలతో చెట్లు లేదా కొమ్మలు విద్యుత్‌ వైర్లకు తాకి షాక్‌ వచ్చే ప్రమాదం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి. వాటిని తాకకుండా విద్యుత్‌ అధికారులకు తెలపాలి.
- వ్యవసాయ నిమిత్తం, గృహాలలో అతుకులు లేని సర్వీస్‌ వైరును మాత్రమే ఉపయోగించాలి.
- తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్‌ తీగలను తాకొద్దు. వెంటనే విద్యుత్‌ సిబ్బందికి తెలపాలి.
- ఎవరికైనా కరెంట్‌ షాక్‌ సంభవిస్తే దగ్గరలోని వ్యక్తులు షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించాలనే అత్రుతతో ముట్టుకోవద్దు. షాక్‌కు గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్‌ ప్రవహించని (కర్ర, ప్లాస్టిక్‌ లాంటి) వస్తువులు వాడడమే సరైన పరిష్కారం.
- ముఖ్యంగా రైతులు వ్యవసాయ పంపు సెట్లను వాడుతున్నప్పుడు కరెంట్‌ మోటార్లకు కాని, పైపులను కాని, ఫుట్‌ వాల్వ్‌లను కాని ఏమర పాటుతో తాకొద్దు. వ్యవసాయ పంపు సెట్లను , స్టార్టర్లను విధిగా ఎర్త్‌ చేయాలి. విద్యుత్‌ ప్రమాదాలు ఎర్త్‌ చేయబడని పరికరాల వల్లే జరుగుతాయి. ఎర్త్‌ చేయబడని మోటార్లు, స్టార్టర్లు, జీ.ఐ పైపులు, ఫుట్‌ వాల్వ్‌లు తాకడం అత్యంత ప్రమాదకరం.
- డిస్ట్రిబ్యూషన్‌ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, ఏబీ స్విచ్‌లు ఆపరేట్‌ చేయడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం.
- మోటారు పంపుసెట్లకు ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే సొంతంగా సరిచేద్దామని ప్రయత్నిస్తే ప్రాణనష్టం, హాని జరగొచ్చు. మోటారు రిపేరు తెలిసిన వారితోనే చేయించాలి.
- గ్రామీణ వినియోగదారులు తమ పరిధిలోని క్షేత్రస్థాయి విద్యుత్‌ సిబ్బంది లైన్‌మెన్‌, లైన్‌ ఇన్‌స్పెక్టర్‌, సీనియర్‌ లైన్‌ ఇన్‌స్పెక్టర్‌, సబ్‌ ఇంజనీర్‌, సెక్షన్‌ ఆఫీసర్లను సంప్రదించి వారి సేవలు పొందాలి.
- విద్యుత్‌ పరికరాలు, వైరింగ్‌, వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు బ్యూరో ఆఫ్‌ ఇండియన్‌ స్టాండర్డ్స్‌ గుర్తింపు కలిగినవి వాడాలి.

విద్యుత్‌ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



"విద్యుత్‌ ప్రమాదాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వినియోగదారులు మరింత జాగ్రత్తగా ఉండాలి. విద్యుత్‌ సమస్యలు వస్తే ఏఈ, సిబ్బందికి తెలపాలి. ప్రతి నెల జారీ చేసే బిల్‌ కమ్‌ నోటీస్‌పై ఏఈ, లైన్‌మెన్‌ ఫోన్‌ నంబర్‌ ఉంటుంది. వినియోగదారులు సొంతంగా మరమ్మతులు చేయకుండా విద్యుత్‌ సిబ్బందికి సమాచారం అందించి వారితోనే సమస్యను పరిష్కరించుకోవాలి.

కె.వెంకటరమణ, ఎస్‌ఈ హనుమకొండ సర్కిల్‌

పొలానికి నీరుపారించడానికి వెళ్లి మృత్యుఒడికి..

- విద్యుదాఘాతంతో రైతు మృతి
- కోనాపురంలో ఘటన



రాజిరెడ్డి (ఫైల్‌)

చెన్నారావుపేట: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని కోనాపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తుమ్మలపెల్లి రాజిరెడ్డి(50) గ్రామ శివారులోని తన పొలం వద్దకు వెళ్లాడు. ఇటీవల నాటు వేయడంతో పొలం మడుల్లో నీరు పారించడానికి విద్యుత్‌ మోటార్‌ వద్దకు వెళ్లాడు. మోటార్‌ పనిచేయకపోవడంతో విద్యుత్‌ స్తంభానికి తగిలించిన తీగలను సరి చేస్తున్నాడు. ఈ క్రమంలో ఒక విద్యుత్‌ తీగ ఊడి మీద పడడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు ఏఎస్సై లక్ష్మణమూర్తి ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లక్ష్మణమూర్తి తెలిపారు. కాగా, మృతుడికి భార్య పద్మ, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

విద్యుత్‌ ఉద్యోగుల సాహసం

- కుంటలో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్‌ సరఫరా పునరుద్ధరణ
- అభినందించిన టీజీ ఎన్పీడీసీఎల్‌ సీఎండీ వరుణ్‌రెడ్డి



కుంటలోని విద్యుత్‌ స్తంభంపై ఎక్కుతున్న విద్యుత్‌ అన్‌మ్యాన్‌ డిస్ట్రిబ్యూషన్‌ వర్కర్‌

హన్మకొండ: విద్యుత్‌ ఉద్యోగులు సాహసం చేశారు. కుంటలో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్‌ సరఫరాను పునరుద్ధరించారు. హసన్‌పర్తి చింతగట్టు నుంచి పలివేల్పుల వైపునకు వచ్చే 11 కేవీ వ్యవసాయ ఫీడర్‌లో విద్యుత్‌ అంతరాయం కలిగింది. అంతరాయాన్ని గుర్తిస్తూ వస్తున్న క్రమంలో పలివేల్పుల కుంట మధ్యలో నుంచి వెళ్లిన విద్యుత్‌ స్తంభంపై ఏదైనా లోపం ఏర్పడొచ్చనే ఆలోచన వచ్చింది. అనుకున్నదే తడువుగా ఎన్పీడీసీఎల్‌ నయీంనగర్‌ ఏఈ అరుణ్‌కుమార్‌ నేతృత్వంలో సిబ్బంది శనివారం పలివేల్పుల కుంట వద్దకు చేరుకున్నారు. విద్యుత్‌ అన్‌మ్యాన్‌ డిస్ట్రిబ్యూషన్‌ వర్కర్లు బానోతు శ్రీను, మునిపల్లి శ్రీను ఈదుకుంటూ వెళ్లి స్తంభం జారుతున్నా అతి కష్టంపై ఎక్కారు. ఇన్సులేటర్‌ ఫెయిల్‌ (పంక్చర్‌) కావడం గుర్తించారు. అనంతరం సమస్యను సరి చేసి విద్యుత్‌ సరఫరాను పునరుద్ధరించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎన్పీడీసీఎల్‌ సీఎండీ కర్నాటి వరుణ్‌ రెడ్డి, హనుమకొండ ఎస్‌ఈ వెంకటరమణ ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్‌ లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ రామకృష్ణ, లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ సుగుణాగర్‌, కుమారస్వామి, లైన్‌మెన్‌ కోటి పాల్గొన్నారు.

నా భర్తను మానసికంగా వేధించి చంపేశారు

- పోలీసులను ఆశ్రయించిన మృతుడి భార్య
- పోలీసుల అదుపులో నిందితుడు?

రామన్నపేట : అప్పు ఇవ్వకపోతే ఇంట్లోకి చొరబడి చితకబాదడమే కాకుండా మానసికంగా వేధించి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడేలా చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం ప్రకారం.. వరంగల్‌ పోతన నగర్‌కు చెందిన వీరగంటి రమేశ్‌(66), రమాదేవి దంపతులు తాపీ మేస్త్రీ పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. రమేశ్‌.. కరీమాబాద్‌కు చెందిన తుంగళ్ల దేవేందర్‌, తుమ్మ రాజు వద్ద కొంత అప్పు చేశాడు. ఈ క్రమంలో దేవేందర్‌, రాజు తమ డబ్బులు ఎప్పుడు చెల్లిస్తావని పేర్కొంటూ రమేశ్‌ను 22వ తేదీన సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు అనుసరించారు. రాత్రి ఇంటికి వెళ్లినా చొరబడి రమేశ్‌తో పాటు అతడి భార్య రమాదేవిపై కూడా దాడికి పాల్పడ్డారు. అనంతరం 23వ తేదీన సాయంత్రం రమేశ్‌ పెద్ద కొడుకు వీరగంటి రాజును సైతం దేవేందర్‌, రాజు తరపు వ్యక్తులు బెదిరించి దూషించారు. దీంతో ఈ ఘటనలపై రమేశ్‌ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. 24వ తేదీన రాత్రి ఎప్పటి లాగే నిద్రించాడు. 25వ తేదీ ఉదయం రమేశ్‌ నోటి నుంచి నురుగు వచ్చిన విషయం గమనించి కుటుంబీకులు వెంటనే వరంగల్‌ ఎంజీఎం తరలించగా అదే రోజు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పోలీసులు.. దేవేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారని సమాచారం.

సీనియారిటీ ప్రకారం పదోన్నతులు

- టెస్కాబ్‌ ఛైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు



మాట్లాడుతున్న టెస్కాబ్‌ ఛైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు

హన్మకొండ : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగులకు సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పిస్తామని తెలంగాణ స్టేట్‌ కోఆపరేటివ్‌ అపెక్స్‌ బ్యాంక్‌ ఛైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్‌ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ డిస్ట్రిక్ట్‌ కో ఆపరేటివ్‌ సెంట్రల్‌ బ్యాంక్‌ ఆఫీసర్స్‌ అసోసియేషన్‌ మొదటి మహాజన సభ జరిగింది. ఈ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కోఆపరేటివ్‌ సెంట్రల్‌ బ్యాంకు అధికారుల సేవలు తమకు ఎంతో సంతృప్తి కలిగిస్తున్నాయన్నారు. బ్యాంకు ఉద్యోగుల సమస్యలు నేరుగా తన దృష్టికి తీసుకురావొచ్చన్నారు. పాలక వర్గంతో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లా బ్యాంకుల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టెస్కాబ్‌ వైస్‌ ఛైర్మన్‌ సత్తయ్య, డీసీసీబీ మహబూబ్‌నగర్‌ ఛైర్మన్‌ వెంకటయ్య, ఆదిలాబాద్‌ ఛైర్మన్‌ భోజా రెడ్డి, మెదక్‌ ఛైర్మన్‌ దేవేందర్‌ రెడ్డి, తెలంగాణ డిస్టిక్ట్‌ కో ఆపరేటివ్‌ సెంట్రల్‌ బ్యాంక్‌ ఆఫీసర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు రియాజుద్దీన్‌, ప్రధాన కార్యదర్శి సర్వేశ్వర రావు, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ శ్రీధర్‌, అసోసియేషన్‌ సభ్యులు ప్రభాకర్‌, ఉదయశ్రీ, కురువ నాయక్‌, అజయ్‌ రెడ్డి, చందర్‌ రావు, విశ్వేశ్వర్‌, స్రవంతి, కృష్ణ ప్రసాద్‌, శైలజ, అజయ్‌ పాల్గొన్నారు.

నిలకడగా ప్రాణహిత నది

- కాళేశ్వరం వద్ద 10.500 మీటర్ల ఎత్తులో ప్రవాహం
- మేడిగడ్డకు 8,85,795 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



కాళేశ్వరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత, గోదావరి నదులు

కాళేశ్వరం: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది నిలకడగా ప్రవహిస్తోంది. శనివారం మహదేవపూర్‌ మండలం కాళేశ్వరం వద్ద గోదావరితో కలిసి పుష్కరఘాట్‌ను తాకుతూ 10.500మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. దీంతో వరద నీరు దిగువన అంబట్‌పల్లిలోని మేడిగడ్డ(లక్ష్మీ)బరాజ్‌కు చేరుతోంది. అక్కడ బరాజ్‌లోకి 8,85,795 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో మొత్తం 85గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. కాగా, ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నప్పటికీ అన్నారం బరాజ్‌ వద్ద 14వేల క్యూసెక్కులు మాత్రమే తరలివస్తోంది. బరాజ్‌లోని 66గేట్లు ఎత్తినీటిని దిగువకు తరలిస్తున్నారు.

డిగ్రీ అధ్యాపకుల బదిలీ ప్రక్రియ

- 1,010 అధ్యాపకుల ఖాళీలు
- శనివారం అర్ధరాత్రి వరకు వెబ్‌ఆప్షన్లు
- ఒకటి, రెండ్రోజుల్లో బదిలీ ఉత్తర్వులు

విద్యారణ్యపురి : రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల బదిలీలకు విద్యాక మిషనర్‌ ఇటీవల షెడ్యూల్‌ విడుదల చేశారు. ఇందులో మల్టీజోన్‌–1పరిధిలో సబ్జెక్టుల వారీగా 1,010 మంది అధ్యాపక ఖాళీల జాబితాను రూపొందించారు. అందులో క్లియర్‌ వేకెన్సీలు 561గాను, 449 తప్పనిసరిగా బదిలీ కావాల్సినవిగా చూపారు. అభ్యంతరాలు కూడా స్వీకరించారు. శనివారం అర్ధరాత్రి వరకు బదిలీ ప్రక్రియకు అధ్యాపకులు వెబ్‌ ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం కల్పించారు. ఐదేళ్లు ఒకేచోట పనిచేసినవారు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తులు చేసుకున్నారు. మల్టీజోన్‌–1 పరిధిలో హనుమకొండ, వరంగల్‌, ములుగు, మహబూబాబాద్‌, జయశంకర్‌ భూపాలపల్లి, సిద్దిపేట, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్‌, నిర్మల్‌, మెదక్‌, కొమురం భీం, కరీంనగర్‌, ఆదిలాబాద్‌, కామారెడ్డి, జగిత్యాల, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు ఉన్నాయి. ఆయా జిల్లాల పరిధిలో కళాశాలలకు అన్ని సబ్జెక్టుల అధ్యాపకులకు బదిలీలకు అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా ఎన్‌సీసీ బాధ్యతలు నిర్వర్తించే అధ్యాపకుల బదిలీలను శనివారం హైదరాబాద్‌లో ఫిజికల్‌ కౌన్సెలింగ్‌ నిర్వహించారు.10 మంది అధ్యాపకుల వరకు బదిలీ అయ్యారని సమాచారం. వీరికి కూడా త్వరలోనే ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో 214 ఖాళీలు

ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో మొత్తం 214 వరకు అధ్యాపకుల ఖాళీలు చూపారని సమాచారం. హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 116, వరంగల్‌ జిల్లాలో 31, మహబూబాబాద్‌లో 36, ములుగులో 16, జయశంకర్‌ భూపాలపల్లిలో 15 ఖాళీలు చూపారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసిన ఎక్కువమంది అధ్యాపకులు పట్టణ ప్రాంత కాలేజీలకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఒకటి, రెండ్రోజుల్లో అధ్యాపకులకు ఆర్డర్స్‌ ఇవ్వనున్నారు. ఈనెల 31 చివరి గడువు ఉండగా, బదిలీ ఆర్డర్స్‌ వచ్చిన వెంటనే తమకు కేటాయించిన కళాశాలల్లో జాయిన్‌ కావాల్సి ఉంటుంది.

ప్రిన్సిపాల్‌ పోస్టుల ఖాళీలు..

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బదిలీలకు 62 ప్రిన్సిపాల్స్‌ పోస్టులు వేకెన్సీలుగా చూపారు. అందులో క్లియర్‌ వేకెన్సీలు 39, తప్పనిసరిగా బదిలీలు 23 ఉన్నాయి. రాష్ట్రస్థాయి పోస్టు కావడంతో దరఖాస్తు చేసిన ప్రిన్సిపాల్స్‌ సీనియారిటీ జాబితా వెల్లడించారు. వీరికి కూడా వెబ్‌ఆప్షన్లను పెట్టుకునే అవకాశం కల్పించారు.

ఆర్థిక ఇబ్బందులు.. ఉద్యోగం పర్మనెంట్‌ కాదేమోనని..


పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్య



వెంకన్న (ఫైల్‌)

తొర్రూరు: ఉద్యోగం పర్మనెంట్‌ కాదేమోనని ఒకవైపు, మరోవైపు ఆర్థిక ఇబ్బందులతో గ్రామ పంచాయతీ కార్యదర్శి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్‌ జిల్లా తొర్రూరు డివిజన్‌ కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్‌ తెలిపిన వివరాల ప్రకారం...పట్టణానికి చెందిన పేర్ల చిన్న భిక్షం, గండెమ్మ దంపతుల కుమారుడు వెంకన్న(32) దంతాలపల్లి మండలం లక్ష్మీపురంలో జూనియర్‌ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దానికితోడు ఉద్యోగం పర్మనెంట్‌ కాకపోవడంతో మనస్తాపానికి లోనయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన వెంకన్న శనివారం పట్టణ శివారు కంఠాయపాలెం రోడ్డులోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గజ ఈతగాళ్లు, వర్ధన్నపేట అగ్నిమాపక సిబ్బంది సహాయంతో పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడికి భార్య లక్ష్మి, రెండేళ్ల వయసున్న కూతురు హర్షిత ఉన్నారు. ప్రస్తుతం లక్ష్మి ఏడు నెలల గర్భిణి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్‌ తెలిపారు.

పాలకుర్తి మండల కేంద్రంలో ఫర్టిలైజర్‌ వ్యాపారి..



సోమశేఖర్‌ (ఫైల్‌)

పాలకుర్తి టౌన్‌ : ఆర్థిక ఇబ్బందులతో ఫర్టిలైజర్‌ వ్యాపారి శనివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పాలకుర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయిప్రసన్నకుమార్‌ కథనం ప్రకారం.. పాలకుర్తికి చెందిన సలేంద్ర సోమశేఖర్‌(32) మండల కేంద్రంలో నాలుగు సంవత్సరాల నుంచి ఫర్టిలైజర్‌ షాపు నిర్వహిస్తున్నాడు. షాపులో ఆర్థికంగా నష్టం రావడంతో దంపతుల మధ్య గొడవలు జరిగాయి. దీనికి మనస్తాపం చెందిన సోమశేఖర్‌.. శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమశేఖర్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఎరువుల కంపెనీల డీలర్ల ఒత్తిళ్లతో..

ఫర్టిలైజర్‌ షాపు నిర్వహణకు సోమశేఖర్‌ రూ. 20 లక్షల పెట్టుబడి పెట్టాడు. రైతులకు ఎరువులు, పురుగుల మందులు ఉద్దెర ఇవ్వడం.. వారు సకాలంలో డబ్బు చెల్లించకపోడంతో పలు కంపెనీల నిర్వాహకులు సోమశేఖర్‌పై ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని ఓ కంపెనీ.. సోమశేఖర్‌ షాపులో నిల్వ ఉన్న స్టాక్‌ను తీసుకెళ్లింది. ఎరువుల కంపెనీల డీలర్లు నిత్యం డబ్బుల కోసం రావడంతో దంపతుల మధ్య జరిగిన గొడవలు సోమశేఖర్‌ ఆత్మహత్యకు దారి తీశాయని సమాచారం. కాగా, మండల కేంద్రంలో సోమశేఖర్‌ చిత్రపటానికి ఫర్టిలైజర్‌ అసోసియేషన్‌ మండల అధ్యక్షుడు అడ్డూరి భూపాల్‌రావు, కార్యదర్శి బత్తుల వెంకన్న, సభ్యులు దొడ్డ మధు, రాపాక సంతోశ్‌, హరీశ్‌, మామిండ్ల శోభన్‌బాబు, శివ నివాళులర్పించారు.

లోక్యతండాలో యువరైతు..



సాంబయ్య (ఫైల్‌)

వేలేరు: అప్పులబాధతో ఓ యువరైతు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండలం లోక్యతండా గ్రామంలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. లోక్యతండా గ్రామానికి చెందిన మురావత్‌ సాంబయ్య (34) ఉన్న రెండు ఎకరాల్లో వరి, పత్తి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 24న తన కొడుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో అడ్మిట్‌ చేసి చికిత్స చేయిస్తున్నాడు. ఇందుకు రూ.2.50 లక్షల వరకు అప్పు తెచ్చాడు. సాగుకు తెచ్చిన అప్పులు అప్పటికే రూ.3.50లక్షలు ఉన్నాయి. కొడుకు ఆరోగ్యం బాగాలేకపోవడం, గతేడాది పంటలు సరిగా పండక చేసిన అప్పులు తీర్చేమార్గం లేక శుక్రవారం మధ్యాహ్న సమయంలో వ్యవసాయబావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి తన చెల్లెకు ఫోన్‌ చేసి విషయం చెప్పాడు. ఆమె వెంటనే వారి బంధువులకు సమాచారం ఇవ్వగా బావివద్దకు వెళ్లి చూసేసరికి చేనులో పడిపోయి ఉన్నాడు. వెంటనే అక్కడికి వెళ్లిన వారు 108కి సమాచారం అందించగా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేలేరు ఎస్సై హరిత శనివారం తెలిపారు.